# ప్రశ్నలు & సమాధానాలు
# ప్రశ్న 322: ఆచరణాత్మక వేదాంత శాస్త్రం
# జూన్ 1, 2024

ఈ ప్రశ్న-సమాధానాలు ప్రొ. అనిల్ కుమార్ గారి సత్యోపనిషద్, సంపుటం 1, పేజీలు 159-165 నుండి తీసికొనబడినవి

స్వామి! వేదాంతం అంటే ఏమిటి?

భగవాన్: వేదం ద్వైతం. వేదాంతం అద్వైతం. వేదాంతం పైన ఇంకేమి లేదు. పాలను తోడు పెడితే పెరుగు అవుతుంది. పెరుగును చిలికితే వెన్న వస్తుంది. వెన్నను కాచితే నెయ్యి వస్తుంది. నెయ్యి ఆఖరి స్థితి. దానిని మళ్ళీ కాచినా నెయ్యిగానే ఉంటుంది. పాలు అన్ని మార్పులు అయిన తర్వాత నెయ్యి అవుతుంది. పాలు ద్వైతం అయితే నెయ్యి అద్వైతం.

స్వామి! వేదాంతంలో ఉన్న త్రైత సిద్ధాంతాలు, అంటే ద్వైతం, విశిష్టాద్వైతం, అద్వైతం, ఒక దానికొకటి విరుద్ధమైన సిద్ధాంతములా? ఒక సిద్ధాంతం చెప్పేది మరొక దానికి వ్యతిరేకములా?

భగవాన్: ఎక్కువ భాగం అందరూ అలాగే అర్థం చేసుకొని ఆచరిస్తుంటారు. కానీ నిజానికి, అది సరి కాదు. మూడు సిద్ధాంతాలు ఏకీకృతమైనవి. ఒక దాని నుండి ఇంకొకటి కొనసాగుతుంది. ఒక దాని లోంచి ఇంకొకటి దారి తీస్తుంది.

ఉదాహరణకు చెఱకును తీసుకుంటే, అందులో గుజ్జు, రసం ఉంటాయి. అదే ద్వైతం. చెఱకును పిప్పి చేస్తే రసం వస్తుంది. రసం ముఖ్యమైనది, చెఱకులోని సారమే అయినప్పటికీ, ఎక్కువ కాలం నిల్వ ఉండదు. ఈ విధంగా చెఱకును పిప్పి చేసి రసమును తీయడం విశిష్టాద్వైతం. ఇదే రసాన్ని శుభ్ర పరచి, పరిశుద్ధం చేసి, సంస్కారం గావిస్తే చక్కెర తయారౌతుంది. ఈ చక్కెర పాడవదు. ఎప్పటికీ అదే స్థితిలో ఉంటుంది. ఇదే అద్వైతం. ఆ చక్కెరను ఎలాగ కావాలంటే అలాగ వాడుకోవచ్చు.

స్వామి! ఎవరూ కర్మను తప్పించుకోలేరు. మా జీవితాలలో జరిగే సంఘటనలన్నీ ముందుగా నిర్ణయించిన ప్రకారంగానే నడుస్తుంటాయి. అందువల్ల కష్టాలకి, దుఃఖాలకి లోనవుతుంటాము. ఇందులోంచి ఎలా బయట పడాలో దారి చూపండి.

భగవాన్: మీ జీవితంలో జరిగే ప్రతి ఒక్కటి మీ గత జన్మల తలపుల, క్రియల ప్రతిబింబాలే. మిమ్మలను ఎవ్వరూ చూడటం లేదని అనుకుంటారు. కానీ మీలో ఉన్న భగవంతునికి మీ తలపులు, భావనలు, క్రియలు అన్నీ తెలుసు. భగవంతుడు సర్వవ్యాపి. ఏది దాచలేరు. రేపో మాపో మీ కర్మలను అనుభవించక తప్పదు. ఇదే జీవిత పరమార్థం.

మీ కష్టాలకు మీరు ఇంకొకరిపై నింద వేస్తారు. కానీ అది పొరపాటు. మీరు చేసిన కర్మలే మీ జీవితంలో సుఖదుఃఖాలకు దారి తీస్తాయి. భగవంతుడు మానవుడు చేసే కర్మలన్నిటికీ  సాక్షి. భగవంతుడు ఈ ప్రకృతిని సృష్టించి మానవుడు ఆనందించడానికి ఇచ్చినప్పటికీ ఒక నిబంధన పెట్టాడు - మానవుడు చేసిన కర్మల ఫలితం అనుభవించాలి. భగవంతుడు పోస్ట్ మాన్ వంటి వాడు. అందరికీ ఇచ్చే ఉత్తరాలలో ఉండే విశేషాల

గురించి ఏ మాత్రమూ కలతపడడు. ఆ విశేషాలు మీకు, మీకు ఉత్తరం రాసిన వారికి ఉన్న బంధం. భగవంతునికి వాటి గురించి ఏ మాత్రం చింత ఉండదు. మీకు వివాహ పత్రిక వస్తే పోస్ట్ మాన్ కి శుభాకాంక్షలు చెప్పరు కదా? మీకు బెదిరింపు ఉత్తరం వచ్చినా పోస్ట్ మాన్ పై నింద వేయరు. ఆ పోస్ట్ మాన్ ఉత్తరాలు అందించడానికి ఉన్న నిమిత్తమాత్రుడు మాత్రమే.

కానీ ప్రార్ధన ద్వారా ఈ కష్టాలు, దుఃఖాలు ఎదుర్కో గలిగే స్థైర్యం లభిస్తుంది. శ్రద్ధతో ప్రార్ధన, స్థిరమైన భక్తి, ధృడమైన నమ్మకం, మనఃపూర్వకమైన పాశ్చాత్తాపం, నిజమైన పరితాపం, అతీతమైన భగవత్ప్రేమలతో మీ జీవితంలో సంభవించే సంఘటనలను మార్చవచ్చు. అవి ఉంటే భగవంతుడు కూడా తన సంకల్పమును వెనక్కు తీసుకొంటాడు. ఉదాహరణకు, మార్కండేయుడిని చూడండి. విధి ప్రకారం అతను పదహారేళ్ళు మాత్రమే బ్రతక గలడు. కానీ అతనికి శివునిపై ఉన్న అపారమైన భక్తి వల్ల మృత్యుంజయుడు అయిపోయాడు. మార్కండేయుని ప్రార్ధనలు విని భగవంతుడు తన సంకల్పాన్ని మార్చి వేయవలసి వచ్చింది.

ఇంకొక ఉదాహరణ తీసుకోండి. జైలులో ఒక ఖైదీ న్యాయం ప్రకారం శిక్షింపబడ్డాడు. జైలులో ఉండగా అతని నడత, నడవడిక బాగుండి, జైలు అధికారులు శాసించే నియమ నిబంధనలు అన్నీ సక్రమంగా పాటిస్తే అతని కారాగార శిక్ష కొంత వరకూ తగ్గించుకోవచ్చు. ఇంకొక విషయం కూడా ఆలోచించాలి. ఒక ఖైదీ రకరకాల కోర్టులలో, జిల్లా కోర్టు, హై కోర్టు, సుప్రీమ్ కోర్టు, అన్నింటిలో కేసు ఓడిపోయినా, భారత దేశపు అధ్యక్షుడు దయా దాక్షిణ్యాల పేర ప్రత్యేక క్షమాపణ ఇస్తే మరణ శిక్ష కూడా తప్పించుకొనే అవకాశం ఉంది.

అదే విధంగా, మీ పూర్వ జన్మల కర్మల వల్ల కష్టాలు, నష్టాలు, దుఃఖాలు ఎదుర్కోవలసి ఉన్నా, మీ మనఃపూర్వకమైన ప్రార్ధనలు విని భగవంతుడు మీ విధిని మార్చి మిమ్మల్ని కష్టాల నుండి తప్పించగలడు. మీ స్థిరమైన భక్తి చూసి కనికరించి ప్రత్యేక అనుగ్రహం ప్రసాదిస్తాడు.

స్వామి**!** భగవద్గీత మంచి అయినా**,** చెడు అయినా**,** మా కర్మ ఫల పరిత్యాగం చేయాలని చెప్తుంది**.** మేము ఎప్పుడో కానీ సుకృతములు చేయం కనుక మీకు అర్పితం చేయడానికి మంచి కర్మల ఫలితాలు ఉండవు**.** చెడు కర్మల ఫలితాలు అర్పించడం సరి కాదు**.** ఏమి చేయాలి**?**

భగవాన్**:** మంచి, చెడు, రెండూ భగవదర్పితం చేయాలి. మంచి అయినా, చెడు అయినా, మీ కర్మఫలితాలపై అనురాగం పెంచుకోకండి. భగవంతుడు అద్వితీయుడు కనుక ఈ రెండింటికీ అతీతంగా ఉంటాడు. మంచి నీరైనా, చెడు నీరైనా గంగలో కలిస్తే గంగ యొక్క పవిత్రత ఎంత మాత్రం తరగదు. అదే విధంగా నిప్పులో ఏమి వేసినా కాలిపోతుంది. నిప్పులో వేసిన వాటి మంచి చెడులు ఏమైనా వాటి కల్మషం నిప్పుకి అంటదు. అందుచేత మీరు మంచిచెడులు రెండూ భగవంతునికి అర్పితం చేస్తే మీరే లాభం పొందుతారు.

ఒక చిన్న ఉదాహరణ. నీ జేబులో అయిదు వందల రూపాయి నోటు పెట్టుకొని వ్యవహార రీత్యా బజారుకు వెళితే ఆ డబ్బును పోగొట్టుకోకుండా జాగ్రత్తగా కాపాడుకుంటావు. ఏ కాఫీకో టీకో హోటల్ కి వెళితే ఎవరూ కొట్టేయకుండా చేయి జేబు మీదే పెట్టుకుంటావు. సినిమాకి వెళితే కూడా జాగ్రత్తగా ఉంటావు. కానీ ఆ డబ్బును బ్యాంకులో వేస్తే అది భద్రంగా ఉంటుంది. అప్పుడు దాని గురించి భయపడక్కరలేదు. అదే విధంగా, మీరు చేసే మంచిని పుణ్యం కొరకు ఆశించకుండా భగవదర్పితం చేస్తే మీరు వినయంగా, నిరాడంబరముగా ఉంటారు. భగవంతుని అనుగ్రహాన్ని ఆనందిస్తారు. భగవంతుని పై కృతజ్ఞతా భావంతో ఉంటారు.

కానీ మీరు చేసిన ప్రతి మంచి పనికి పుణ్యం కొరకు ఆశిస్తే, మీరే కర్త అని భావించి గర్వము, అహంకారము పెరిగిపోతాయి. అందువల్ల మీరు చేసిన మంచి పనుల ఫలితాలు భగవంతునికి అర్పణ చేయాలి.

ఇక చెడు పనులు భగవంతునికి ఎలా అర్పించాలి? అది తప్పుగా మీరు భావించవచ్చు. కానీ అది కూడా మీ మంచికే అని గుర్తించాలి. దీనికి ఒక చిన్న ఉదాహరణ. నీ దగ్గర ఒక నలిగిపోయి, చిరిగిపోయిన అయిదు వందల రూపాయల నోటు ఉందనుకో. అది పాడయిపోయింది కదా అని పారేయవు కదా. దానిని ఎవరూ తీసుకోరు, దానితో ఏమి కొనలేవు. పారేయలేవు, వాడలేవు. అదే నోటును రిజర్వ్ బ్యాంకులో ఇస్తే వారు అది తీసుకొని నీకు సరికొత్త నోటు ఇస్తారు. ఆ నోటు మీద అంకె కనిపించినంత వరకూ వారు దానిని తీసుకొని బదులుగా కొత్త నోటు ఇస్తారు.

అదే విధంగా మీరు చేసిన చెడు కర్మలు, వాటి ఫలితాలు భగవంతునికి అర్పితం చేస్తే, మీ భక్తి యొక్క అంకె చూసి భగవంతుడు మిమ్మల్ని సరికొత్త రూపంలో మార్చి వేస్తాడు. భగవంతుడు రిజర్వ్ బ్యాంకు వంటి వాడు. భగవంతుడు మాత్రమే మీ వికృత భావాలను, చెడు పనులను స్వీకరించి, మంచి భావాలుగా మార్చి వేయగలడు. అందువల్ల మంచి, చెడు, రెండూ భగవంతునికి అర్పితం చేస్తే మీరే లాభం పొందుతారు.

స్వామి**!** ద్వైతమైన అనుభవాలన్నీ మా మనసు నుండి ఉద్భవించినవే**.** స్వామి **"**మనసు ఒక పిచ్చి కోతి వంటిది**"** అన్నారు**.** సుఖదుఃఖాలు రెండూ మనసు వల్లనే**.** మనోనాశనం ఎలా చేసుకోవాలి**?**

భగవాన్**:** మనసు నిన్ను దుఖానికి లోబరచదు. ఉపయోగించిన దానిపై ఆధార పడి ఉంటుంది. దేని లోకి వెళితే దాని రూపం ధరిస్తుంది. చావు లేనిది. కనుకనే మనో మూలమ్ ఇదం జగత్ అన్నారు. అందుచేత మనోనాశనం తప్పు. మీరు కోరుకోవలసింది మనోలయం.

నది ఎలా అయితే సముద్రంలో కలిసిపోతుందో, మనసు కూడా ఆత్మలో అదే విధంగా లీనమైపోవాలి. భగవంతునికి శరణాగతం అయిపోయిన మనసు రామదాసు. కానీ కోరికలకు బానిస అయిపోయిన మనసు కామదాసు.

మనసు బలిమి, కలిమి, చెలిమి అనే వాటికి లొంగకూడదు. ఎప్పుడూ దైవ భావనలతో నిండి ఉండాలి. అప్పుడే దైవములో లీనమైపోతుంది.

వచ్చే వారం ఆచరణలో పెట్టగల ఆధ్యాత్మిక జ్ఞానంతో మళ్ళీ కలుద్దాం. ధన్యవాదములు.

ఓం సాయి రామ్